www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 డిసెంబర్ 2024

డిఎంహెచ్ఒగా మాలిని బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిఎంహెచ్ఒగా డాక్టర్ మాలిని మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం డిఎంహెచ్ఒ మాలిని కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎంహెచ్ఒ మాలిని

చి'వరి'లో టెన్షన్..!

పెదపాడు మండలంలో రోడ్డుపైన ఉన్న ధాన్యం రాశులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జెడి హబీబ్ బాషా

ఖరీఫ్ మాసూళ్లు చివరి దశకు చేరినప్పటికీ ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అల్పపీడన ప్రభావంతో సోమవారం నుంచి జిల్లాలో వర్షం, చలిగాలులతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో మిగిలిన ఖరీఫ్ ధాన్యం, రబీ నారుమడులను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు, చలిగాలులు

ఆఖరు దశకు చేరిన ఖరీఫ్ మాసూళ్లు

రెండు జిల్లాల్లోనూ లక్ష టన్నుల వరకూ ధాన్యం కళ్లాల్లోనే

తడవకుండా ధాన్యం కాపాడుకునేందుకు అన్నదాత అవస్థలు

రబీ నారుమళ్లు, నాట్లతో రైతులు బిజీబిజీ

నారుమడులపై వర్షం ప్రభావం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఖరీఫ్ ఆరంభంలో విరుచుకుపడిన వరదలు, వర్షాలకు రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. మిగిలిన పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఖరీఫ్ కోతలు ప్రారంభమైన తర్వాత బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ మూడుసార్లు వాయుగుండాలు రైతులను వెంటాడాయి. అధికారుల లెక్కల ప్రకారం 90 శాతం వరకూ ఖరీఫ్ కోతలు, ధాన్యం విక్రయాలు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ టార్గెట్ పెట్టుకోగా ఇప్పటి వరకూ 2.83 లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు రైతుల ఖాతాల్లో రూ.585 కోట్లు వరకూ జమ చేశారు. మరో 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. పెదపాడు, ఏలూరు రూరల్ పరిధిలో 12 వేల మెట్రిక్ టన్నులు, పెదపాడు మండలంలో ఐదు నుంచి ఆరు వేల మెట్రిక్ టన్నులు, ముదినేపల్లిలో ఐదు వేల మెట్రిక్ టన్నులు, వేరే మండలాల్లో మరికొంత కుప్పలు, ధాన్యం రూపంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు టార్గెట్ 4.10 లక్షల మెట్రిక్ టన్నులుండగా, ఇప్పటి వరకూ 3.70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మరో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకూ రైతుల వద్ద ఉన్నట్లు చెబుతున్నారు. నరసాపురం, ఆకివీడు, యలమంచిలి, ఆచంట వంటి మండలాల్లో ఇంకా ధాన్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో రైతులు ధాన్యం కాపాడుకునేందుకు నానావస్థలు పడుతున్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పలిన్లు వంటివి కప్పి ఉంచి కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం చినుకులే పడుతుండటంతో ప్రస్తుతానికి కొంత పర్వాలేదని రైతులు చెబుతున్నారు. 28వ తేదీ వరకూ వర్షాల ప్రభావం ఉండనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రబీ సాగుపై వర్షం ప్రభావం

ఖరీఫ్ మాసూళ్లు చివరి దశకు చేరుకోవడంతో రబీ సాగుపై రైతులు పూర్తిగా నిమగ్నమయ్యారు. రెండు జిల్లాలవ్యాప్తంగా రబీలో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. రెండు జిల్లాల్లో నారుమడులు దాదాపు పూర్తయ్యాయి. నాట్లు సైతం మొదలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల ఎకరాల్లో నాట్లు పూర్తవ్వగా, ఏలూరు జిల్లాలో 500 ఎకరాలకుపైగా నాట్లు పూర్తయ్యాయి. వర్షంతో నారుమడులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. నారుమడులు చివరిదశలో ఉండటంతో వర్షానికి మొలకలు దెబ్బతింటున్నట్లు అన్నదాత చెబుతున్నాడు. నాట్లు నాటేందుకు సైతం రైతులు వెనుకాడుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో విరుచుకుపడిన భారీ వర్షాలతో నారుమడులు, నాట్లు నాటిన పొలాలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో రెండోసారి నారుమడులు వేయాల్సి రావడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలను చవిచూశారు. దీంతో అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

క్రీస్తు దయాగుణం ప్రతిఒక్కరూ ఆచరించాలి

సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో సంతోషాలు నింపాలి. ప్రేమ, త్యాగానికి ప్రతీకైన క్రీస్తు బోధనలు ప్రతిఒక్కరూ ఆచరించాలి. ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలని క్రీస్తు ప్రజలకు బోధించడమే కాక జీవించి చూపారు. క్రైస్తవ సోదర, సోదరీమణులంతా క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలి.

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రేమ, క్షమాగుణం, దయాతత్వం, శాంతితత్వం ప్రతిఒక్కరూ కలిగి ఉండాలి. క్రిస్మస్ వేడుకలను అంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి.

అందరి జీవితాల్లో ఆనందం, శాంతి నిండాలి

జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్

జిల్లాలో ఉన్న క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు. ఈ పండుగతో మీ జీవితాల్లో ఆనందం, శాంతి, ప్రేమ నిండాలి. మంచి ఆరోగ్యంతో కుటుంబ సమేతంగా సురక్షితంగా ఉండాలి.

పెంచిన ఛార్జీలు తగ్గించాలని విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పెంచిన విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని కోరుతూ మంగళవారం మండలంలోని జగన్నాథపురంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా నేత సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ పెంచిన విద్యుత్ భారాలను ఉపసంహరించి, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తొడం మునియ్య, గంగులు, వంజం రాము పాల్గొన్నారు.



జీలుగుమిల్లి మండలం జగన్నాథపురంలో..

చాట్రాయి: ప్రజలపై విద్యుత్ భారాలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మంగళవారం చాట్రాయిలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హోలీమేరీ మాట్లాడారు. పెద్దసంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

చిరుజల్లులు.. రైతుల ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అల్పపీడన ప్రభావంతో మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో వరి, వేరుశెనగ పంటల రైతులు ఆందోళన చెందుతున్నారు. కామయ్యపాలెం, బర్రింకలపాడు, అంకంపాలెం గ్రామాల్లో పలు చోట్ల పనల మీదే పంటలు ఉన్నాయి. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఆడేసిన కాయలను బరకాలు కప్పి భద్రపరుచుకున్న రైతులు

అంగన్వాడీ కేంద్రాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టిన టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టిన టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల కల్పన పనుల ప్రగతిపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 227 అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణానికిగాను 225 టాయిలెట్లు పూర్తయ్యాయని, 186 అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం పనులకుగాను 176 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈ వారం చివరిలోగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. టాయిలెట్లకు తప్పనిసరిగా పైపులైన్ల ద్వారా నీటిసౌకర్యం కల్పించాలన్నారు. పూర్తయిన టాయిలెట్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తాగునీటి సౌకర్యం పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని, రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్మాణ పనులన్నీ తప్పనిసరిగా నాణ్యతతో ఉండాలన్నారు. పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించి ధ్రువీకరించాలన్నారు. నిర్మాణ పనులను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నాణ్యత లేకుండా నాసిరకం కట్టడాలుంటే వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని 855 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్‌వాటిక, హార్వెస్టింగ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు 14,284 లక్ష్యానికిగాను ఇంతవరకు 6022 కుళాయి కనెక్షన్లు అందించామని, మిగిలిన 8264 ఇళ్లకు నిర్దేశించిన సమయంలోగా కుళాయి కనెక్షన్లు అందించాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జి.త్రినాధ్‌బాబు, ఐసిడిఎస్ ఇఇ మల్లిక, సిడిపిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వినియోగదారులు హక్కులను వినియోగించుకోవాలి

జాతీయ వినియోగదారుల దినోత్సవంలో జెసి పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

వినియోగదారుల శ్రేయస్సు కోసం కల్పించిన హక్కులను అంతా వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి ఆర్ఎస్ఎస్.రాజు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ వస్తువుల కొనుగోలులో వినియోగదారులు మోసపోకుండా ఉండాలంటే వారు తప్పనిసరిగా వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యమన్నారు. వినియోగదారుల సేవలను సులభంగా విస్తరించే క్రమంలో ఈ సంవత్సరం 'వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణకు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై ప్రతి వినియోగదారుడూ వస్తువుల కొనుగోళ్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. వస్తువుల నాణ్యతలోను, రేటులోను తదితర విషయాల్లో వినియోగదారులు మోసపోతే వెంటనే వర్చువల్ ద్వారా కేసును వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ ప్రక్రియ ఎంతో సులభతరమైందన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించారని, జిల్లావ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు 'వినియోగదారు న్యాయపాలన వర్చువల్ విచారణకు, డిజిటల్ సౌలభ్యం' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు కోదండరామ్మూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. వస్తువుల కొనుగోలులో వినియోగదారులకు మోసం జరిగితే వినియోగదారుల రక్షణ చట్టం ఉపయోగించుకోవాలని తెలిపారు. చాలామంది వినియోగదారులు వస్తువుల ప్రచారం ద్వారా మోసపోతున్నారని, దీనిని నివారించడానికి వినియోగదారుల ఫోరంను దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో వక్తలు జోసఫ్, కట్టా సత్యనారాయణ, రామాంజనేయచార్యులు, రామరాజు, హరిప్రసాద్ తదితరులు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, సర్టిఫికెట్లను ఆయా విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ అందజేశారు. అనంతరం జిల్లాలో వినియోగదారుల వాలంటరీ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులను దుశ్శాలువాతో జెసి సన్మానించారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు విజయకృష్ణ, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వి.శ్రీలక్ష్మి, విద్యార్థులు, స్కూల్ ఉపాధ్యాయులు, సివిల్ సప్లయిస్ అధికారులు, తూనికలు, కొలతలు అధికారులు, ట్రాన్స్‌పోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

పలు సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

నిడమర్రులో..

ప్రజాశక్తి - నిడమర్రు

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని కోరుతూ నిడమర్రు అంబేద్కర్ సెంటర్, భువనపల్లిలో వివిధ సంఘాల నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బిజెపి మనువాద, మతోన్మాద రాజకీయాలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన్, కమిలి నాని, కొండల విజయ్‌కుమార్, కె.జాన్, జాలాది రవికుమార్, సిహెచ్.సురేష్, నేలపాటి చంటి, మార్లపూరి సన్నీ పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ అధ్యక్షతన మండలంలోని ఆదివాసి గిరిజన సంఘం, దళిత సంఘం, మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మడివి దుర్గారావు, బుడిపిటి జాన్ బాబు, కొల్లూరి సత్తిపండు, ఊకె ముత్యాలరావులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్లో అవమానపరిచేలా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్ షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురిమెళ్ల శ్రీను, బుర్రి సుధాకర్, కొత్త వెంకటేశ్వర్లు, బీమయ్య, ఇబ్రహీం, గుమ్మల వెంకట నర్సయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేలేరుపాడులో..

ఏలూరు : రాజ్యసభలో బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఏలూరు పాత బస్‌స్టాండ్ దగ్గర గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా బయలుదేరి వెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మరలా ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్ బాబు మాట్లాడుతూ రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడటాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని, అమిత్ షా తక్షణమే భారత ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గరికిముక్కు వెంకటేశ్వరరావు, దాసి వెంకటేశ్వర్లు, కలపాల రాజకుమార్, బుంగా ఏసు, కర్రె అంబేద్కర్, చాట్ల శ్రీను, పోసు మణి పాల్గొన్నారు.

ఏలూరులో బిఎస్‌పి ఆధ్వర్యాన..

ఆగిరిపల్లి: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల పట్ల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా ఆగిరిపల్లిలోని సుందరయ్య నిలయంలో మంగళవారం పలువురు నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమూరి విల్సన్‌రాజు, పాతూరి రవి, బిడి.రవికుమార్, షేక్ జహంగీర్ బాషా, సత్తు కోటేశ్వరరావు, ఆర్.హనుమాన్లు, నైనవరపు ఊళక్కయ్య, షేక్ సుభానీలు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

బుజ్జి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు

ఏలూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

అసంపూర్తిగా ఉన్న పనులన్నీ పూర్తి: మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మాజీ ఎంఎల్ఎ బడేటి కోట రామయ్య (బుజ్జి) విగ్రహం ఏర్పాటుకు కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో జెడ్‌పి కార్యాలయానికి సమీపంలో స్థలం కేటాయింపునకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో 19 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణతో చర్చించి సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. మేకల కబేలా నిర్వహణకు అనుభవజ్ఞుడైన డాక్టర్‌ను నియమించాలని నిర్ణయించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో పని చేసే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఎవరైనా మరణిస్తే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు చెల్లించాలని కౌన్సిల్ నిర్ణయించిందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నిధుల్లేక పనులేవీ చేపట్టలేకపోయామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులతో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిపై ఎంఎల్ఎతో చర్చించి ప్రాధాన్యతాక్రమంలో చేపడుతున్నట్లు తెలిపారు. పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. సమావేశంలో కమిషనర్ భానుప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నూర్జహాన్

క్రిస్మస్ సందర్భంగా విద్యుద్దీపాల వెలుగులో చర్చిలు

ముదినేపల్లిలో..

కలిదిండిలో..

నిజాలను నిర్భయంగా రాసేదే ప్రజాశక్తి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి: నిజాలను నిర్భయంగా రాయడంలో ప్రజాశక్తి దినపత్రిక ముందుంటుందని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడిలోని ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ప్రజాశక్తి 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావటంలో ప్రజాశక్తి ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొంద్రు దేవా, జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

పొలసానిపల్లి సర్పంచి షేక్ రహిమా బేగం హుసేన

ప్రజాశక్తి - భీమడోలు

అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తున్న సర్పంచి

పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచి షేక్ రహిమా బేగం హుసేన తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు, ప్రముఖులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి యు.జయరామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి సాల్మన్ రాజుతో కలిసి గ్రామంలో పర్యటించారు. వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. మురుగు నీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించినందుకు చేపట్టిన పనులను చూశారు. అనంతరం సర్పంచి మాట్లాడుతూ గ్రామంలోని ఏడవ వార్డు, 9వ వార్డుల్లో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను చూశారు. అనంతరం 10, 11, 12వ వార్డుల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించటం, ఆ ప్రాంతంలో వరద ముంపు బెడదను తప్పించేందుకు శిథిలమైన మురుగునీటి తూరలను తొలగించి, వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా నూతన తూరలు అమర్చే కార్యక్రమాలను పరిశీలించారు. మెరుగైన పనితీరు కోసం తగు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పక్ష నాయకులు బొబ్బా రమేష్, ఎం.శ్రీను, బొబ్బా బాలాజీ, శ్యామ్ రాజా, మూసా పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : ఎడిఎ

చింతలపూడి : విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి రావాలని చింతలపూడి అగ్రికల్చర్ ఎడిఎ నాగకుమార్ ఆకాంక్షించారు. చింతలపూడి బట్టువారిగూడెం లిబార్టీ చిల్డ్రన్స్ హౌస్ వద్ద క్రిస్మస్ పండుగ సందర్భంగా అర్పణ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. కష్టపడి చదువుతూ మంచి పేరు తీసుకురావాలని కోరారు. అన్నదమ్ములుగా కలసిమెలసి ఉండాలని, ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు. పది మందికి సహాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

27న విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి పోరుబాట

చింతలపూడి : వైసిపి ప్రభుత్వ పాలన కాలం 5 సంవత్సరాలలో మొత్తం మీద 50 పైసల లోపు విద్యుత్ ఛార్జీలు పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలలో రూపాయిన్నర పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని వైసిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. చింతలపూడిలో వైసిపి అధినేత జగన్ పిలుపు మేరకు ఈనెల 27వ తేదీన జరిగే 'కరెంట్ ఛార్జీల బాదుడుపై వైసిపి పోరుబాట' వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరావు, ప్రచార విభాగం అధ్యక్షులు చిలుకూరి జానారెడ్డి, జెడ్‌పిటిసి మొలుగుమాటి నీరజ, ఎంపిపి బాణావత్తు రాంబాబు, టౌన్ అధ్యక్షులు కొప్పుల నాగు, వైసిపి సీనియర్ నాయకులు గోలి శరత్ రెడ్డి, తల్లాబత్తుల శ్రీను, ఆత్కూరి సుబ్బారావు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సగర కులస్తులకు అండగా ఉంటాం

టిడిపి సగర సాధికార రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్

నూజివీడు టౌన్ : రాష్ట్రంలోని సగర(ఉప్పర) కులస్తులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా టిడిపి రాష్ట్ర సగర సాధికారత ద్వారా అండగా ఉంటామని టిడిపి సగర సాధికార రాష్ట్ర అధ్యక్షులు జంపన వీర శ్రీనివాస్ అన్నారు. గొల్లపల్లి గ్రామంలో సగర కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆంధ్రప్రదేశ్ సగర(ఉప్పర) సాధికారత తరపున రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జంపన వీర శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని గొల్లపల్లి గ్రామ సగర(ఉప్పర) కుటుంబీకులు ముగ్గురు యాక్సిడెంట్‌లో చనిపోవడం చాలా బాధాకరమని, ఆ కుటుంబంలో పెద్ద దిక్కు అయిన భార్యాభర్తలు ఇద్దరు చనిపోవడం ద్వారా చిన్నపిల్లలు ఇద్దరూ అనాథలుగా మిగిలారన్నారు. ఆ కుటుంబానికి ఇలా కష్టం వచ్చిందని తెలియజేయగానే స్పందించి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేసిన రాష్ట్రంలోని సగర కులస్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజ్జల గణేష్, చెక్కపల్లి సర్పంచి సత్యనారాయణ, నూజివీడు బిసి సెల్ నాయకులు నక్క యోహాన్, ముసునూరు సర్పంచి బాబి పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

డ్వాక్రా గ్రూప్ సభ్యుల నిరసన

పోలవరం: మారుమూల పల్లెల్లో ఉంటూ స్వయం సమృద్ధి సాధించేందుకు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే, ఆదివాసీలకు అప్పులు చూపించారు. ఒకటి, రెండూ కాదు ఏకంగా రూ.10 లక్షలు అప్పు చెల్లించాల్సిందే అంటూ బ్యాంకర్లు ఆ డ్వాక్రా గ్రూపు సభ్యులకు హుకుం జారీ చేశారు. నివ్వెరపోయిన గిరిజనులు పోలవరంలోని మండల సమైక్య వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరం మండలం ఉడతపల్లి, మెత్తప్ప కోట మారుమూల కొండకోనల్లో ఉన్న గిరిజన గ్రామాలు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. ఉడతపల్లిలో మూడు డ్వాక్రా గ్రూపులు, మెత్తప్ప కోటలో ఏడు డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఉడతపల్లిలో ఉన్న మూడు గ్రూపులకు సంబంధించి రుణం తీసుకోకపోయినా ఉన్నత శ్రీ నిధి నుంచి రూ.5 లక్షల 50 వేలు బాకీ ఉందని వెలుగు అధికారులు, బ్యాంకర్లు చెప్పడంతో నివ్వెరపోయారు. ఈ గ్రూపుల సభ్యులు ఎవరూ రుణాలు పొందలేదు. ఏ రుణం తీసుకోకపోయినా ఐదున్నర లక్షల బాకీ చూపించే సరికి ఒక్కసారి షాక్‌కు గురయ్యారు. కూలీకి వెళ్తేగానీ పొట్టగడవని నిరుపేద గిరిజన సభ్యులు రుణం పొందకుండా ఎలా కడతామని ప్రశ్నించినా, కట్టి తీరాలంటూ అధికారులు హుకుం జారీ చేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపు ఖాతాల్లో ఉన్న సొమ్ము కూడా మాయమవుతోందని వాపోతున్నారు. డ్వాక్రా గ్రూపులకు ఉన్నత శ్రీనిధి కింద ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుంటుంది. అసలు ఆ పథకం కింద కూడా ఎటువంటి సొమ్ము పొందలేదని అమాయక గిరిజనులు వాపోతున్నారు. ఇక మెత్తప్పకోట గ్రామ సమాఖ్యలో డ్వాక్రా సంఘాలకూ రూ.10 లక్షల 67 వేల 614 అప్పుగా ఉందని అధికారులు చూపించారు. ఈ గ్రూపులలో అభినందన గ్రూప్‌కి రూ.1,50,000, శ్రీ సూర్య గ్రూప్‌కి రూ.లక్ష 50 వేలు, శ్రీ శాంతి గ్రూప్‌కి రూ.2 లక్షల 50 వేలు అప్పుందని వెలుగు అధికారులు వారిని వేధిస్తున్నారు. రెండున్నర ఏళ్ల క్రితం పెట్టుకున్న శ్రీశాంతి గ్రూపుకు కూడా రూ.2 లక్షల 50 వేల లోన్ ఉండడం గమనార్హం. మీరు రుణం చెల్లించలేదు కాబట్టి మండల సమైక్య నుంచి వచ్చే పథకాలేవీ వర్తించవని అధికారులు స్పష్టం చేశారని సభ్యులు వాపోతున్నారు. అస్సలు తాము ఏ అప్పు తీసుకోలేదని తుమ్మల కాంతమణి, తుమ్మల కృష్ణవేణి, కత్తుల సీతారామలక్ష్మి, ములెం సుభద్ర, యండపల్లి సూర్య కుమారి, గోరం లలిత, మూలెం రామలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. పల్లవి డ్వాక్రా గ్రూపు వారు బ్యాంక్ నుంచి లోన్‌గా రూ.7 లక్షల 50 వేలు తీసుకున్నామని, దానికి తాము రూ.12 లక్షల 61 వేలు విఒఎకు చెల్లించామని బక్కా విజయలక్ష్మి, మడకం లక్ష్మి చెప్పారు. బాకీ తీరిపోయినా ఇంకా అప్పు చెల్లించాలని అంటున్నారని వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి అవినీతి అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.4,500 నగదు, 5 ద్విచక్ర వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.నవీన్ కుమార్ తెలిపారు. వారందరినీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నగర పంచాయతీ అభివృద్ధి ఎన్నడో..!

మహిళలకు మరుగుదొడ్లు లేని దుస్థితి
కనీస మౌలిక సదుపాయాల కల్పన శూన్యం
సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ ఊసే లేదు..

ప్రజాశక్తి - చింతలపూడి

గత 5 సంవత్సరాలలో చింతలపూడి నగర పంచాయతీ పదేళ్ల వెనక్కి వెళ్లింది. అభివృద్ధి లేదు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంది పరిస్థితి. సరైన రోడ్లు లేవు, డ్రెయినేజీ వ్యవస్థ లేదు, కొన్ని ఏరియాల్లో వీధి లైట్లు కూడా లేని దుస్థితి. నగర పంచాయతీ అభివృద్ధిలో శూన్యం. ఎంతలా అంటే చింతలపూడి నగర పంచాయతీలో కనీసం మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. చింతలపూడి నగర పంచాయతీకి అందం తెచ్చే సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ చేయలేని పరిస్థితిలో ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ లేక వెలవెలబోతున్న నగర పంచాయతీ

పన్నులు పెరుగుతున్నా.. అభివృద్ధి మాత్రం శూన్యం..

చింతలపూడి నియోజకవర్గానికి చింతలపూడి మండలం ప్రధాన కేంద్రం ఐనా అభివృద్ధిలో గత పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించటంతో అభివృద్ధిలో వెనుక పడింది. చింతలపూడి మండలం జనాభా 91,098 హౌస్ హోల్డర్స్ 23,708 ఉన్నాయి. ఇందులో చింతలపూడి నగరపంచాయతీ జనాభా సుమారుగా 20 వేల వరకు ఉంటుంది. మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు 80 లక్షలు పన్నులు ఉన్నాయని, నగర పంచాయతీ అప్ గ్రేడ్ అయిన తరువాత 1.40 లక్షలు ఉన్నాయన్నారు. ప్రతి సంవత్సరం 15 శాతం పన్నులు పెరుగుతున్న నగర పంచాయతీలో అభివృద్ధి మాత్రం కనిపించడం లేదు.

పబ్లిక్ మరుగుదొడ్లు లేక మహిళల పాట్లు

మహిళల కోసం పబ్లిక్ మరుగుదొడ్లు కట్టించాలని, మహిళలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారి ఇబ్బందులు పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. గత 10 సంవత్సరాలుగా చింతలపూడి నగర పంచాయతీలో మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అనేకసార్లు స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ ఏర్పాటు కానీ పరిస్థితి నెలకొంది. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు చింతలపూడి నగర పంచాయతీలో ఉండటంతో వివిధ పన్నుల నిమిత్తం వస్తూ ఉంటారు. చింతలపూడి పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకూ ఒక్క పబ్లిక్ మరుగుదొడ్లు లేకపోవడంతో అరుబయట వెళ్లవలసి వస్తుంది. దీంతో మహిళలు సిగ్గుతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే నగర పంచాయతీలో పబ్లిక్ మరుగుదొడ్లు లేకపోవటం మహిళల పాలిట శాపంగా మారింది. చాలా దుకాణాలు, వస్త్రదుకాణాలు, ఇతర దుకాణాలలో కూడా మరుగుదొడ్లు లేని పరిస్థితి. మరుగుదొడ్లు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, మహిళలకు ఇబ్బందులు ఎప్పుడు తొలిగిపోతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ఎన్నడో..

సెంట్రల్ లైటింగ్ లేక నగర పంచాయతీ వెలవెలబోతుంది. చింతలపూడి మేజర్ పంచాయతీగా ఉన్న సెంట్రల్ లైటింగ్ నగర పంచాయతీగా మారినప్పుడు సెంట్రల్ లైటింగ్ లేకపోవడం గమనార్హం. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అనేక మార్లు అధికారులకి, రాజకీయ నాయకులకు వినతి అందజేసినా ఉపయోగం లేని పరిస్థితి. అధికారులను అడుగుతుంటే నిధులు మంజూరు కావాలి అంటున్నారు. నిధులు ఎప్పుడు మంజూరు అవుతాయో తెలియని పరిస్థితి. చింతలపూడి నగర పంచాయతీపై అధికారులు దృష్టి పెడితే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా మురికి, వరద నీరు రోడ్డు మీదకు వస్తున్నాయి. రోడ్లు వేసినా, మరమ్మతులు చేసినా రోడ్డుకి ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లు త్వరగా పాడై గుంతలు పడుతున్నాయి. ఆక్రమణలు తొలగించి, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచి, రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పావని, చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్

మరుగుదొడ్లు నిర్మాణం చేస్తాము. సెంట్రల్ లైటింగ్‌కి నిధులు మంజూరు ఐతే వెంటనే పనులు చేపడుతాం. ఎంఎల్ఎ కూడా దీని మీద ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నగర పంచాయతీ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తాము. రోడ్ల మరమ్మతులు చేస్తున్నారు.

గిరిజన చట్టాలపై అవగాహనుండాలి

పీసా గ్రామసభలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి : గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ కార్యాలయంలో జరిగిన పీసా గ్రామసభపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు గిరిజన చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామసభలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో పీసా కమిటీకి అత్యంత ప్రాధాన్యత ఉందని గుర్తు చేశారు. దీనికి సంబంధించి త్వరలో నూతన కమిటీలను ఎన్నుకోనునున్నట్లు తెలిపారు.

రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా వంకవారిగూడెం

అనంతరం రీ సర్వే ప్రాజెక్టుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వంకవారిగూడెం గ్రామాన్ని రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా తీసుకున్నట్లు తహశీల్దార్ స్లీవజోజి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో పడిన గ్రామాలకు సంబంధించిన భూములను త్వరలో కమిటీ వేసి, రీ సర్వే చేసి, అర్హులైన వారికి అప్పగించనున్నట్లు తెలిపారు. ఎంపిపి కోర్స పోసమ్మ, సర్పంచి కుంజా పార్వతి, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, తహశీల్దార్ స్లీవజోజి, జనసేన మండల అధ్యక్షులు రాము, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో పీసా గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. పోలవరం, గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, కొంద్రుకోట, జిల్లెల్లగూడెం, చేగొండపల్లి, ఎల్లండీపేట గ్రామాలలో పీసా గ్రామసభలు నిర్వహించి, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పంచాయతీల నోడల్ అధికారులు, సర్పంచులు పాల్గొనగా ఎంపిడిఒ ఇ.శ్రీనివాస్ అన్ని కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించారు.

గిరిజన భూములకు హక్కు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పోలవరం

తరతరాలుగా గిరిజనులు సాగుచేస్తున్న ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూములకు అడంగల్‌లో నమోదు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వింజరం గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ భూ సదస్సు కార్యక్రమంలో రెవెన్యూ పరిధిలో సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ వింజరం రెవెన్యూ పరిధిలో వింజరం, బోడిగూడెం, కొమ్ముగూడెం, వెంకటరెడ్డిగూడెం సమీపంలో గత 30 సంవత్సరాలుగా సాగుచేస్తున్నారని తెలిపారు. వింజరం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 182/2, 192/2, 192/3, 192/4, 144, 106/2, 211/1, 266/1, 266/2, 266/3, 266/4లలో మొత్తం 47 ఎకరాలలో 100 మంది గిరిజన పేదలు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్నారన్నారు. ఏళ్ల తరబడి గిరిజన పేదలు సాగుచేస్తున్న అడంగల్‌లో నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. భూ సమస్యలపై ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలలో గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్‌టిఆర్, 1/70 చట్టపరిధిలో ఉన్న భూములను గిరిజనులకు సాగు నమోదు, హక్కు పట్టాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. వివాదాల భూములలో ఇరుపక్షాల రికార్డులు, టైటిల్ రికార్డులు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బొరగం భూ చంద్రరావు, సముద్రాల సాయికృష్ణ, గోకూరి పాండవులు పాల్గొన్నారు.

ముసునూరు : అటవీ పోరంబోకు భూములు కాకుండా రెవెన్యూ భూముల్లో ఏవైనా సమస్యలు ఉన్నా రైతులు తమ అర్జీలు ఇచ్చినట్లయితే పరిష్కరించబడునని రెవెన్యూ తహశీల్దార్ పిజె.శర్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 9 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, మాజీ సర్పంచి శ్యామలరావు, విఆర్ఒలు నవీన్, యశోద, ఎన్.మస్తాన్, మణేంద్ర, హనీబాబు, విజయకుమారి, హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

మండవల్లి : భూ సంబంధిత సమస్యలకు రెవెన్యూ సదస్సులు చక్కటి పరిష్కార వేదికని తహశీల్దార్ కె.గోపాల్ స్పష్టం చేశారు. మండలంలోని మూడు

రెవెన్యూ సదస్సులో గిరిజనుల వినతి

పోలవరం : వినతిని అందజేస్తున్న గిరిజనులు

తాళ్లపాడులో మంగళవారం ఆయన అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్య ఏర్పడి రైతులు ఎంతోమంది సతమతమవుతున్నారని అన్నారు. అందువల్ల క్రయ విక్రయాలు చేసుకోలేక భూ సంబంధిత సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులను విధిగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సభలను వినియోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముత్యాల రాజ్య సులోచన, ముళ్లపూడి సత్తిబాబు, ఆర్ఐ శ్రావణి, విఆర్ఒ వీర్రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు

చింతలపూడి : అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ఎవరినీ ఎవరూ బాధపెట్టకుండా తోటివారికి సహాయపడటం వంటి లక్షణాలు అందరూ కలిగి ఉండాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరం హరిజనవాడలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్ కుమార్ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ఎవరినీ ఎవరూ బాధపెట్టకుండా తోటివారికి సహాయ పడటం వంటి లక్షణాలు అందరూ కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎంఎల్ఎ రోషన్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

ముదినేపల్లి : మంచి పనులు చేస్తూ జీవించాలని విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగరాజు సూచించారు. ముదినేపల్లి లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగరాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు శాంటాక్లాజ్, ఏంజెల్ వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నితిన్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : క్రైస్తవ సహోదరులు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకునే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రార్థనా మందిరాలు రంగురంగుల అలంకారాలతో ముస్తాభయ్యాయి. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెం, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం, ప్రకాష్ నగర్, పుట్రేపు, మర్రిగూడెం, గండిగూడెం, బంధంచర్ల తదితర గ్రామాల్లో పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు చర్చిలపై స్టార్‌లు, లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో ఇప్పటికే పండగ వాతావరణం కనిపిస్తోంది.

ముసునూరు: సేవా దృక్పథంతో, సర్వమత సమ్మేళనంతో క్రిస్టమస్ పండుగను ప్రతిఒక్కరూ జరుపుకోవాలని టిడిపి మండల నాయకులు పాకనాటి సీతారాం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని 25 చర్చిలకు గాను, 25 కేకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వమత సమ్మేళనంతో ఏసుక్రీస్తు అందరికీ మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో శుభాకాంక్షలు తెలియజేస్తూ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాకనాటి ఆంజనేయులు, మేటికోట హేమ, దేవినేని డలరామ్, దేవినేని శ్రీధర్ బాబు, కోనేరు భాస్కర్, దేవినేని సాంబయ్య, నల్లిపోయిన రాంబాబు, రేగుల అజయ్, అవినాష్, చింత శ్రీను పి.ఏసుపాదం, పి.భాష, పేరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు: కేకులు పంపిణీ చేస్తున్న సీతారాం

వెయిటింగ్ హాల్ నిర్మాణం కోసం తీర్మానం

ముదినేపల్లి : వెయిటింగ్ హాల్ కోసం మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయడం జరిగిందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఒక దినపత్రికలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రయివేటు వ్యక్తులను ఏర్పాటు చేశారన్న ఉదంత కథనంపై ఎంపిపి స్పందించగా, సమాచార హక్కు చట్టంపై ప్రతి పనికి ఒక రేటు అనే కథనాలపై ఎంపిడిఒ వై.రామకృష్ణ స్పందించారు. వారు ఈ కథనాలపై విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ముదినేపల్లి వంటి పెద్ద మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే వారికి వెయిటింగ్ హాల్ ఆవశ్యకత ఎంతైనా ఉందని, సభ్యుల వినతి చొప్పున గతంలో స్టోర్ రూముగా ఉన్న గదిని మరమ్మతులు చేసి వెయిటింగ్ హాల్ నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. దీనిపై ప్రయివేటు వ్యక్తులు ఎవరూ లేరని, ఇది సత్యం కాదని కొట్టిపారేశారు. సమాచార హక్కు చట్టంపై నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నామని, ప్రతి పనికి ఒక రేటు ప్రాసగా వాడడం తప్ప ఇందులో వాస్తవం లేదని, ఉంటే తమ దృష్టికి తెస్తే చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఆధునీకరణ పనులు ఎంపిపి వివరించారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలి : ఎస్‌పి

ఆగిరిపల్లి : లోన్ యాప్‌లు, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడంతో పాటు బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన రికార్డులను, రిసెప్షన్ సెంటర్‌ను, లాకప్ గదులను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో గ్రామ సంరక్షణ కార్యదర్శుల పాత్ర కీలకమని, వారు అంకితభావంతో పనిచేసి గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా సమాచారాన్ని సేకరించి, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియపర్చాలని ఆదేశించారు. నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్ఐ కె.శుభశేఖర్ పాల్గొన్నారు.

పలు చోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని అలివేరు, కోట నాగవరం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ధాన్యం కొనుగోలు ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరికోతలు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని తెలిపారు. రబీ సీజన్‌కి సంబంధించి పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా వారు సాగు చేసుకుంటున్న ప్రతి పంటను ఇ పంటలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరి, మొక్కజొన్న, మినుములు, పెసర వంటి పంటలకు పంటల బీమా చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని తప్పనిసరిగా రైతులు వినియోగించుకోవాల్సిందిగా తెలిపారు. అనంతరం రైతులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని సుంకొల్లు, బత్తులవారి గూడెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ చీడ పురుగుల ఉధృతి గమనించుకొని 2 ఎంఎల్ వేప ద్రావణంను ఒక లీటర్ నీటితో పిచికారీ చేసుకొని సస్యరక్షణ చేసుకోవాలని తెలిపారు. సూక్ష్మ ధాతు లోపం నివారణకు చీలేటెడ్ జింక్ ఒక గ్రామును లీటర్ నీటితో కలిపి మొక్కజొన్న పైరులో పిచికారీ చేయాలన్నారు. కోసిన వరి పంటను టార్పలిన్ పట్టాలను కప్పుకొని కాపాడుకోవాలని తెలిపారు. పనల మీద ఉన్న వరి పంటకు పది లీటర్ల నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేసుకోవాలని, మొక్కజొన్న పైరుకు పంటల బీమా పథకం ఈనెల 30 వరకు మాత్రమే ఉంది కావున ఎకరాకు 483 ప్రీమియం కట్టి బీమా చేయించుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంట వేసిన ప్రతి రైతు ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారిని ఆర్.హేమ మాట్లాడుతూ పంటల బీమా మామిడికి ఎకరాకు 2,250 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని, ఈనెల 31 వరకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. మామిడి చెట్లకు పూత రాలకుండా మెరుగైన యాజమాన్య పద్ధతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు, సర్టిఫికెట్ అందజేత

ఆగిరిపల్లి: జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మండల పరిధిలోని సీతారామపురం ఎంపియుపి పాఠశాలకు చెందిన సిహెచ్.యశ్వంతి తృతీయ స్థానం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి సర్టిఫికెట్‌తో పాటు రూ.1500 నగదును అందజేసినట్లుగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యశ్వంతిని మండల విద్యాశాఖాధికారి కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్ అభినందించారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. జనసేన మండల సీనియర్ నాయకులు మొగళ్ల హరిబాబు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఆటపాకల వెంకటేశ్వరరావు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వహకులు వారికి ఆలయ జ్ఞాపికలు అందజేసి, కండువాలు కప్పి సత్కరించారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాల్లో సుమారు మూడు వేల మంది పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ నిర్వహకులు ఎవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు దోకల నాగేశ్వరరావు దంపతులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMED ARSHUYA ZAKEER SHAREF W/O MOHAMMED ZAKEER SHAREF R/o D.No. 1-167/1, L.G APPARMENT, ROAD No.12, NEAR MOSQUE, DWARAKA NAGAR, B D COLONY, ELURU TOWN & DISTRICT A.P. INDIA, HAVE CHANGED MY NAME ZAKEER SHAREF ARSHUYA TO MOHAMMED ARSHUYA ZAKEER SHAREF SAMEAS INTIMATED TO THE

CHANGE OF NAME

I, MOHAMMED ARSHUYA ZAKEER SHAREF W/O MOHAMMED ZAKEER SHAREF R/o D.No. 1-167/1, L.G APPARMENT, ROAD No.12, NEAR MOSQUE, DWARAKA NAGAR, B D COLONY, ELURU TOWN & DISTRICT A.P. INDIA, HAVE CHANGED MY DAUGTER'S NAME ZAREENA SHAREF TO MOHAMMED ZAREENA SHAREF SAMEAS INTIMATED TO THE

పురపాలక సంఘ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం. e-1664603/ఏ1,2019, తణుకు, ది.24.12.2024

బహిరంగ వేలం నోటీసు

తణుకు పురపాలక సంఘ వీక్లి మార్కెట్-2లో దిగువ తెలిపిన షాపులకు 3 సంవత్సరముల కాలంకు నెలసరి అద్దె విలువల పై లీజుకు ఇచ్చుటకు పురపాలక సంఘ కార్యాలయములో ది.31-12-2024వ తేదీన ఉదయం గం.11.00లకు కమీషనర్ వారిచే గాని, వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	షాప్ నెంబర్లు	ప్రతిపాదించిన	డిపోజిట్	సాల్వెన్సీ
1	1,2,3,4,5,6,7,8,10,11,13	4617/-	20000/-	100000/-
2	9 మరియు 12 SC కేటగిరి	2310/-	10000/-	100000/-

పై పట్టికలో చూపన సాల్వెన్సీ మరియు డిపోజిట్ సమర్పించిన వారిని మాత్రమే పాటలో పాల్గొనుటకు అనుమతించబడును. పాటను వాయిదా లేక రద్దు పరుచుటకు ఈ కార్యాలయము అధికారం కలిగియున్నది. వివరములు కొరకు ఆఫీసు పని దినములలో సంప్రదించవలెను.

సం/- కమిషనర్
తణుకు పురపాక సంఘం.